నమస్తే తెలంగాణ
# సిద్దిపేట
I హైదరాబాద్, మంగళవారం 28 జనవరి 2025 SIDDIPET

## కేసీఆర్ ఆయురారోగ్యాలతో ఉండాలని కేతకీలో ఎమ్మెల్యే పూజలు



కేసీఆర్ పేరుమీద ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే, డీసీఎంఎస్ చైర్మన్

ఝరాసంగం, జనవరి 27: సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలంలోని మేదపల్లి మాజీ సర్పంచ్ పరమేశ్వర్ పాటిల్ చేస్తున్న పాదయాత్ర విజయవంతం కావాలని, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆయురారోగ్యాలతో ఉండాలని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ కేతకీ సంగమేశ్వ స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఎమ్మెల్యే, చైర్మన్లకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ ఆవరణలోని అమృతగుండంలో జలలింగానికి ప్రత్యేక పూజలు చేశారు. కేసీఆర్ పేరు మీద గర్భగుడిలోని పార్వతీసమేత సంగమేశ్వర స్వామికి అభిషేకం, మహా మంగళహారతి వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి ఆశీస్సులతో కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని, తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలని స్వామి వారిని కోరుకున్నారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి వారికి పూలమాల శాలువాతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం పాదయాత్రగా బయలుదేరుతున్న వారందరిని గులాబీ కండువా కప్పి పూలమాలతో సన్మానించారు. స్వామి వారి ప్రసాదాన్ని కేసీఆర్‌కు అందజేయాలని వారికి సూచించారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేశం, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు జగదీశ్వర్, ఝరాసంగం పట్టణ అధ్యక్షుడు ఎజాజ్ బాబా, ఎస్కె సోహెల్, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, నాయకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కేసీఆర్‌ను కలిసేందుకు పాదయాత్ర



పాదయాత్రను ప్రారంభిస్తున్న జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, శివకుమార్

- కేసీఆర్ అంటే ఇష్టం.. ఆయన పాలన అందరికీ ఆదర్శం
- పదేండ్లలో రాష్ట్రం విలువను వందరెట్లు పెంచిందే.. కేసీఆర్
- ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తా..
- కేసీఆర్ లేని లోటు ప్రజలకు స్పష్టంగా తెలుస్తుంది...
- 100 మందితో 140 కిలోమీటర్ల పాదయాత్ర
- ఆయన ఉద్యమం ముందు... నా పాదయాత్ర చాలా చిన్నది
- సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం మేదపల్లి మాజీ సర్పంచ్ పరమేశ్వర్ పాటిల్

ఝరాసంగం, జనవరి 27: సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలంలోని మేదపల్లికి చెందిన మాజీ సర్పంచ్ పరమేశ్వర్ పాటిల్ ఆధ్వర్యంలో సుమారు 100 మంది యువకులు పాదయాత్రగా కేసీఆర్‌ను కలిసేందుకు సోమవారం సంగమేశ్వరాలయంలో పూజలు నిర్వహించారు. బీఆర్ఎస్ అధినేత నిండునూరేండ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామి వారికి అభిషేకం, మహా మంగళహారతి వంటి ప్రత్యేక పూజలు చేశారు. నాలుగు రోజుల పాటు సాగే పాదయాత్ర గజ్వేల్ మీదుగా ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫామ్‌హౌస్ వరకు 140 కిలోమీటర్లు సాగునున్నది. ఈ పాదయాత్రను జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ వారికి గులాబీ కండువాలు కప్పి పూలమాలతో సన్మానించి ప్రారంభించారు. తెలంగాణ జాతిపిత కేసీఆర్‌పై ఉన్న అభిమానంతో పాదయాత్రగా వెళ్తున్న పరమేశ్వర్ పాటిల్ బృందానికి ఎక్కడా సమస్య రాకుండా అన్ని విధాలుగా చూసుకుంటామని ఎమ్మెల్యే , డీసీఎంఎస్ చైర్మన్ తెలిపారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ మాట్లాడుతూ...కేసీఆర్ అంటే నాకు ఇష్టం. ఆయన పాలన చాలా బాగుంటుంది. పదేండ్లలో రాష్ట్రం విలువను వందరెట్లు పెంచారన్నారు. ఆయన లేనిలోటు ప్రజలకు స్పష్టంగా తెలుస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కేసీఆర్‌కు వివరిస్తానన్నారు. ఒక్కడుగు ముందుకేసి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన జాతిపితను కలుసుకోవాలనే సంకల్పంతో ఈ పాదయాత్ర చేస్తున్నానని తెలిపారు. ఆయన ఉద్యమం ముందు నా పాదయాత్ర చాలా చిన్నదని, నా పాదయాత్రకు మద్దతు తెలిపిన ఎమ్మెల్యే, డీసీఎంఎస్ చైర్మన్‌కు రుణపడి ఉంటానన్నారు. పాదయాత్రకు బస్వరాజ్, ప్రశాంత్, మారుతి, చంద్రయ్య, మాణిక్, వెంకట్, సతీశ్, పాండు, బోయిని పాండు, విజయ్, శ్రీనివాస్, మోహన్, అవుసలి బస్వరాజ్, రాము, అశోక్, శివు, వీరన్న, గోపాల్, దత్తు, ప్రదీప్, నవీన్, రాషాబ్ షకీల్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేశం, జగదీశ్వర్, ఎజాజ్ బాబా, సోహెల్, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హామీల అమలులో సర్కార్ విఫలం



బీఆర్ఎస్‌లో చేరిన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న భూపాల్‌రెడ్డి

- గ్యారెంటీలను గంగలో కలిపిన ప్రభుత్వం
- కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు అసహనం
- బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు
- 'ఖేడ్' మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నాగల్‌గిద్ద, జనవరి 27: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను సీఎం రేవంత్‌రెడ్డి గంగలో కలిపి డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి విమర్శించారు. సోమవారం మండలంలోని ఖూబాతండాకు చెందిన మాజీ సర్పంచ్ శకుంతల, కిషన్‌నాయక్, కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి సోమవారం తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి నారాయణఖేడ్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గెలుపోటములతో సంబంధం లేకుండా బీఆర్ఎస్ పేదలకు అండగా నిలుస్తుందన్నారు. హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రైతుబంధు రూ.15 వేలకు పెంచుతామని ప్రగల్భాలు పలికి, ఇప్పుడు రూ.12 వేలు ఇస్తామంటూ రైతులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. తండాల్లో తాగునీటి సమస్య వేధిస్తున్నా పట్టించుకోకుండా బీఆర్ఎస్ ప్రభుత్వంపై నిందలు వేస్తూ కాలం గడుపుతున్నారన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షుడు నర్సింహులు ముదిరాజ్, మాజీ సర్పంచ్ రాజు, సుజాత, బంగారు రాజు, మల్లేశ్, గౌరి ప్రసాద్, విజయ్ ఉన్నారు.





చిన్నశంకరంపేటలో రైతుభరోసా కోసం ఫోన్ చెక్ చేసుకుంటున్న రైతులు నరహరి, కిష్టయ్య, నర్సయ్య

# కొందరికే రైతు భరోసా

## సంగారెడ్డి జిల్లాలో 25 గ్రామాల్లోని రైతులకు డబ్బులు విడుదల

- రైతుల ఖాతాల్లో ఇంకా జమకాని డబ్బులు
- ప్రభుత్వం తీరుపై రైతులు ఆగ్రహం
- ఏకకాలంలో రైతుబంధు డబ్బులు జమచేసిన కేసీఆర్



సంగారెడ్డి, జనవరి 27(నమస్తే తెలంగాణ): ఏడాదికి రూ.15వేల రైతుభరోసా ఇస్తామని చెప్పిన రేవంత్ సర్కార్ మాట తప్పింది. సంగారెడ్డి జిల్లాలోని రైతులందరికీ ఏకకాలంలో రైతుబంధు డబ్బులు జమ చేయకుండా ఎంపిక చేసిన గ్రామాల రైతులకు మాత్రమే కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా అందజేస్తుంది. జిల్లాలో మొత్తం 647 గ్రామాలు ఉండగా వీటిలో మండలానికి ఒకటి చొప్పున ఎంపిక చేసిన 25 గ్రామాల్లోని రైతులకు మాత్రమే ప్రభుత్వం రైతుభరోసా ప్రారంభించింది. ఆదివారం బ్యాంకులకు సెలవుకావడంతో సోమవారం నుంచి 25 గ్రామాల్లోని రైతుల ఖాతాల్లో ఎకరాకు రూ.6వేల చొప్పున రైతుభరోసా డబ్బులు జమ కావటం ప్రారంభమైంది. 25 గ్రామాల్లోని 19,933 మంది రైతులకు ప్రభుత్వం రైతు భరోసా డబ్బులు విడుదల చేసింది. ఎంపిక చేసిన 25 గ్రామాల్లోని అందరి రైతుల ఖాతాల్లో డబ్బులు జమకాలేదు. ఎకరంలోపు భూమి ఉన్న రైతుల ఖాతాల్లో డబ్బులు జమయ్యాయి. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై రైతుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తం అవుతుంది. ఎంపిక చేసిన గ్రామాల్లో సైతం రైతులందరికీ ఏకకాలంలో రైతుభరోసా డబ్బులు జమకాకపోవడంపై రైతులు మండిపడుతున్నారు. కేసీఆర్ పాలనలో జిల్లాలోని రైతులందరికీ ఏకకాలంలో రైతుబంధు డబ్బులు ఖాతాల్లో జమయ్యేవని, కేసీఆర్ రైతుల పక్షపాతని రైతాంగం గుర్తు చేసుకుంటున్నారు.

### కేసీఆర్‌ను గుర్తు చేసుకుంటున్న రైతులు

జిల్లా రైతాంగం కేసీఆర్, రైతుబంధు పథకాన్ని గుర్తు చేసుకుంటున్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా కేసీఆర్ తన పాలనలో ప్రతిరైతుకూ ఎకరాకు ఏడాదికి రూ.10వేల పెట్టుబడి సాయం అందజేశారు. రైతుబంధు పథకం కింద వానకాలం, యాసంగి సీజన్లలో జిల్లాలోని రైతులందరికీ ఖాతాల్లో ఏకకాలంలో కేసీఆర్ సర్కార్ జమ చేసింది. 2018లో రైతుబంధు పథకం ప్రారంభమైంది. సంగారెడ్డి జిల్లాలో 2023 వరకు 3.24 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.3272 కోట్ల పెట్టుబడి సాయాన్ని కేసీఆర్ ప్రభుత్వం జమ చేసింది. కేసీఆర్ ఏకకాలంలో రైతుబంధు డబ్బులు జమ చేసేవారని, ఇప్పుడు రేవంత్‌రెడ్డి సర్కార్ రైతు భరోసా పేరుతో మోసం చేస్తున్నదని రైతులు మండిపడుతున్నారు.

### మాట తప్పిన రేవంత్ సర్కార్

రైతుభరోసాపై రేవంత్ సర్కార్ మాట తప్పిందని రైతులు మండిపడుతున్నారు. ఏడాదికి రూ.15వేల రైతుభరోసా ఇస్తామని ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక రైతుభరోసాపై మాట తప్పారు. వానకాలంలో రైతుభరోసా డబ్బులు విడుదల చేయలేదు. దీనికితోడు రైతుభరోసా అమలుకు రేవంత్‌రెడ్డి సర్కార్ పలు ఆంక్షలు విధించే ప్రయత్నం చేస్తుంది. సాగుకు యోగ్యమైన భూమికే రైతుభరోసా ఇస్తామని, 10 ఎకరాల్లోపు ఉన్న రైతులకు రైతుబంధు ఇస్తామని కాంగ్రెస్ సర్కార్ రైతుభరోసాపై లీకులు ఇస్తుంది. దానికి తగ్గట్టుగానే ఇటీవల సంగారెడ్డి జిల్లాలో సాగుకు యోగ్యంకానీ భూములను అధికారులు గుర్తించారు. సంగారెడ్డి జిల్లాలో 6వేల ఎకరాలకు పైగా సాగుకు యోగ్యం కానీ భూమిని గుర్తించారు. జనవరి 26 నుంచి ఎంపిక చేసిన గ్రామాల్లో ఏడాదికి రూ.12వేల చొప్పున రైతుభరోసా అమలు చేస్తామని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. జిల్లాలో ఎంపిక చేసిన 25 గ్రామాల్లో అందరి రైతుల ఖాతాల్లో రైతుభరోసా డబ్బులు జమకాలేదు. 25 గ్రామాల్లోని 19,933 మంది రైతుల ఖాతాల్లో డబ్బులు జమకావాల్సి ఉండగా సోమవారం ఎకరంలోపు విస్తీర్ణం ఉన్న రైతుల ఖాతాల్లో మాత్రమే డబ్బులు జమయ్యాయి. సంగారెడ్డి జిల్లాలో మొత్తం 647 గ్రామాలు ఉండగా ప్రభుత్వం కేవలం 25 గ్రామాల్లోని రైతులకు మాత్రమే రైతుభరోసా డబ్బులు విడుదల చేసింది. మిగితా 622 గ్రామాల్లోని రైతులకు రైతు భరోసా వర్తింపుపై స్పష్టత లేదు. దీంతో ప్రభుత్వం తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### టకీ టకీ లేదు.. టింగు టింగు లేదు

గుమ్మడిదల, జనవరి 27: నాకు రెండెకరాల 20 గుంటల భూమి ఉంది. సీఎం రేవంత్‌రెడ్డి నాలుగు నెలల నుంచి ఊరించి. రైతు బంధును, రైతు భరోసాగా మార్చి ఇదిగో వేస్తాను... అదిగో వేస్తాను...అని నిన్నటి వరకు డెడ్‌లైన్ పెట్టి ఆదివారం అర్ధ రాత్రి నుంచి టకీటకీమని పడతాయన్నాడు.. అప్పటినుంచి ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నాను. కానీ టకీటకీ లేదు.. టింగు టింగు లేదు.. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఫోన్ పట్టుకొని పిచ్చోడిలాగా చూస్తూ కూర్చున్నా. ఫేస్‌బుక్ చూశాను.. మార్చి 31వరకు అంట... ఇలా మాట చెప్పిన 20 నిమిషాల్లోనే మాట మీద మాట మార్చేసిన సీఎం ప్రపంచంలోనే ఎవరూ లేరు అనుకుంటా...



– రామప్ప, రైతు, కొత్తపల్లి, గుమ్మడిదల మండలం

## ఫోన్లు మోగలే.. రైతు భరోసా రాలే..

చిన్నశంకరంపేట, జనవరి 27: రాత్రి 12గంటలు ఏమో కానీ, పగలు 12గంటలు దాటినా ఫోన్లు మోగలే.. రైతు భరోసా డబ్బులు రాలేదు. సోమవారం మధ్యాహ్నం 12గంటల దాటినా రైతుల అకౌంట్లలో డబ్బులు పడకపోయేసరికి అన్నదాతలు నిరుత్సాహానికి గురయ్యారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి రైతుల అకౌంట్లలో రైతు భరోసా డబ్బులు ఎకరాకు రూ.6000 చొప్పున పడతాయని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో రైతులు ఉదయం నుంచి ఫోన్లు పట్టుకొని రైతు భరోసా డబ్బులు కోసం ఎదురుచూశారు. కొంతమంది రైతులు బ్యాంకుల వద్దకెళ్లి అకౌంట్లు చెక్ చేసుకున్నారు. డబ్బులు పడలేదని బ్యాంకు అధికారులు తెలుపడంతో నిరుత్సాహంతో వెనుతిరిగారు. గతంలో కేసీఆర్ సార్ నాట్ల ముందు రైతుబంధు డబ్బులు వేసేవారని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ వర్షాకాలం ఎగ్గొట్టింది. యాసంగి నాట్లు పూర్తయినా ఇప్పటి వరకు రైతు భరోసా డబ్బులు వేయలేదని మండలంలోని వివిధ గ్రామాల రైతుల ఆవేదన వ్యక్తం చేశారు. రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఆగం చేస్తుందన్నారు. రైతు భరోసా డబ్బులు వస్తాయని ఆశతో రైతులు గంట గంటకు ఫోన్లను చెక్ చేసుకున్నారు. సాయంత్రం ఐదు గంటల వరకు కూడా రైతు భరోసా డబ్బులు అకౌంట్‌లో పడకపోవడంతో నిరుత్సాహానికి గురయ్యారు.

# సేవలు కొనసాగించాలి

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం.. చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధిస్తాం



ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో చేర్యాల మున్సిపల్ పాలకవర్గం

- మున్సిపల్ పాలకవర్గానికి సన్మానం
- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, జనవరి 27: ప్రజాప్రతినిధుల పదవీకాలం ముగిసినా, ప్రజాసేవ కొనసాగించాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణంలోని వీరభద్ర ఫంక్షన్ హాలులో కమిషనర్ నాగేందర్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పాలకవర్గం వీడ్కోలు సమావేశం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడమే తన ధ్యేయమని, మున్సిపల్ చైర్‌పర్సన్, సభ్యులు పదవీకాలం ముగిసినప్పటికీ వార్డుల్లో దృష్టికి వచ్చిన సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన అనంతరం అసెంబ్లీలో చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు అంశంపై మాట్లాడానని, చారిత్రాత్మక ప్రాంతమైన చేర్యాల డివిజన్ ఏర్పాటు విషయం సీఎంతో పాటు మంత్రులకు విజ్ఞప్తి చేశానని, అన్ని వర్గాలను కలుపుకొని చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధిస్తామన్నారు. ఎమ్మెల్సీగా పనిచేసిన తొమ్మిదేండ్లలో పార్టీలకు అతీతంగా అన్నివర్గాల సమస్యలు పరిష్కరించానని, ఆ పార్టీ, ఈ పార్టీ అనే విషయాన్ని పట్టించుకోలేదని, ఎన్నికలప్పుడే రాజకీయాలు చేయాలని, ప్రజాక్షేత్రంలో ప్రజలు ఎవరిని ఆశీర్వదిస్తే వారు ప్రజాప్రతినిధులు అవుతారని, ప్రజల నిర్ణయానికి వ్యతిరేకంగా పోతే వారే బుద్ధి చెబుతారన్నారు. అధికారులు సైతం ప్రజాప్రతినిధులకు సహకరించాలని, పదవీకాలం ముగిసింది వారితో మనకు ఏం పని అనుకోవద్దని, ప్రజాప్రతినిధుల దృష్టికి వచ్చిన సమస్యలను అధికారులు దృష్టికి తీసుకుపోతే వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. చేర్యాల మున్సిపల్ పాలవకవర్గం అన్ని విధాలుగా పట్టణాన్ని అభివృద్ధి చేసిందని, రానున్న రోజుల్లో మరిన్ని నిధులు తీసుకువచ్చి చేర్యాలను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణిశ్రీధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్లు మంగోలు చంటి, పచ్చిమడ్ల సతీశ్‌గౌడ్, జుబేదాఖాతూన్ ఎక్బాల్, యాట కనకమ్మ యాదగిరి, చెవిటి లింగం, ఆడెపు నరేందర్, ముస్త్యాల తారా యాదగిరి, ఉడుముల ఇన్నమ్మభాస్కర్‌రెడ్డి, తుమ్మలపల్లి లీలాసంజీవులు, సందుల సురేశ్, కోఆప్షన్ సభ్యులు ముస్త్యాల నాగేశ్వర్‌రావు, ఆరోగ్యరెడ్డి, జేబాబేగంలను కమిషనర్ నాగేందర్, మేనేజర్ ప్రభాకర్, సీనియర్ అసిస్టెంట్ కృష్ణ, మున్సిపల్ వార్డు అధికారులు, సిబ్బందితో కలిసి శాలువా కప్పి, మెమొంటోలు అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు ఎమ్మెల్యే పల్లాను సన్మానించారు.

### క్యాలెండర్లు, డైరీలు ఆవిష్కరించిన ఎమ్మెల్యే

ప్రజాజ్యోతి, ఆంధ్రప్రభ దినపత్రికలు రూ పొందించిన క్యాలెండర్లు, డైరీలను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి విలేకరులు శ్రీకాంత్, కరుణాకర్‌లతోపాటు పలువురు జర్నలిస్టు యూనియన్ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పత్రికలు, మీడియా ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు వెలుగులోకి తీసుకువచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో తాడెం రంజితాకృష్ణమూర్తి, చేతిరెడ్డి సందీప్‌రెడ్డి, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గదరాజు చందు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లాను పలువురు వ్యాపార, వాణిజ్య వర్గాల ప్రతినిధులు శాలువా కప్పి సన్మానించారు.

## అర్జీలు సత్వరమే పరిష్కరించాలి


- సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, జనవరి 27: ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి వినతులు స్వీకరించారు. భూ సంబంధిత, ఇండ్లు, ఆసరా పింఛన్లకు సంబంధించి 117 దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో డీఆర్వో నాగరాజమ్మ, డీఆర్డీవో జయదేవ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### ప్రజావాణికి 65 అర్జీలు

సంగారెడ్డి కలెక్టరేట్, జనవరి 27: ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి 65అర్జీలు అందాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులు తమ ఫిర్యాదులను అధికారులకు అందజేసి, వాటిని సకాలంలో పరిష్కరించాలని కోరారు. ఆయా అర్జీలను స్వీకరించిన కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డీఆర్వో పద్మజారాణి, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

## ప్రొటోకాల్ ఉల్లంఘనపై కలెక్టర్‌కు ఫిర్యాదు



సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరికి ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట, జనవరి 27: ప్రజా పాలనలో భాగంగా జనవరి 26న నిర్వహించిన అధికారిక కార్యక్రమాల్లో ఎలాంటి రాజ్యాంగ పదవులు లేని కాంగ్రెస్ నేతలు పాల్గొనడం ప్రొటోకాల్ ఉల్లంఘననేనని బీఆర్ఎస్ నేతలు అన్నారు. ప్రొటోకాల్ ఉల్లంఘనపై బీఆర్ఎస్ నాయకులు గుండు భూపేశ్, జాప శ్రీకాంత్‌రెడ్డి, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి సోమవారం సిద్దిపేట జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ మనుచౌదరికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజా పాలనలో భాగంగా నంగునూరు మండలం నాగరాజుపల్లిలో జరిగిన అధికారిక పథకాల ప్రారంభోత్సవంలో రాజ్యాంగ పదవులు లేని కాంగ్రెస్ నాయకులు పూజల హరికృష్ణ, ఇతర మండల నాయకులను మండల ప్రత్యేకాధికారి డీపీవో, తహసీల్దార్ వేదిక మీదికి పిలిచి సంక్షేమ పథకాల మంజూరు పత్రాలు ఇప్పించడం ప్రొటోకాల్ ఉల్లంఘననేనన్నారు. అధికారులు వారిని పిలిచి ఎలా ఇప్పిస్తారని ప్రశ్నించారు. కొంతమంది అధికారులు అధికార పార్టీ నాయకులను ప్రోత్సహించడాన్ని బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. గతంలోనూ ఇలాంటివి జరిగాయని, వాటిని దృష్టిలో పెట్టుకొని మళ్లీ పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు రమేశ్, అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

# సాగునీటి కోసం రోడ్డెక్కిన రైతన్న

- అక్బర్‌పేట-భూంపల్లిలో రోడ్డుపై బైఠాయించిన్న రైతులు



దుబ్బాక: అక్బర్‌పేట-భూంపల్లి (రామాయంపేట-సిద్దిపేట) రహదారిలో కూడవెల్లి బ్రిడ్జిపై బైఠాయించి నిరసన తెలుపుతున్న బొప్పాపూర్ రైతులు, మద్దతుగా నిలిచిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు



నంగునూరు: ఈఈకి వినతిపత్రం అందజేస్తున్న అక్కెనపల్లి గ్రామ రైతులు

దుబ్బాక, జనవరి 27: సాగునీటి కోసం అన్నదాతలు రోడ్డెక్కారు. కాంగ్రెస్ సర్కారులో సాగునీటి కోసం రైతులు కన్నీళ్లు పెడుతున్నారు. తలాపునా మల్లన్నసాగర్ ఉన్నప్పటికీ సాగునీరు విడుదల చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో అక్బర్‌పేట-భూంపల్లి మండలం బొప్పాపూర్ రైతులు ఆందోళనకు దిగారు. కూడవెల్లి వాగు పరిసర ప్రాంతమైన బొప్పాపూర్ రైతులు సోమవారం సాగునీటి కోసం రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిరసన చేపట్టిన రైతులకు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు అండగా నిలిచి ధర్నాలో పాల్గొన్నారు. కూడవెల్లివాగులో నీరు అడుగంటిపోవడంతో పంట పొలాలకు సాగునీరు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ సర్కారులో తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో కూడవెల్లి వాగు జలకళ సంతరించుకున్నదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ సర్కారులో వాగులోకి నీరు విడుదల చేయక వెలవెల బోతున్నదని, వేసిన పంట పొలాలు ఎండుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.

### నీటిని విడుదల చేయాలి

నంగునూరు, జనవరి 27: రంగనాయకసాగర్ రిజర్వాయర్ నుంచి కుడి కాలువ ద్వారా నీటిని విడుదల చేయాలని కోరుతూ మండలంలోని అక్కెనపల్లికి చెందిన సుమారు వంద మంది రైతులు సోమవారం ఇరిగేషన్ శాఖ ఈఈ గోపాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మరికొద్ది రోజుల్లో నీటిని విడుదల చేయకపోతే పంట పొలాలు ఎండిపోయే పరిస్థితి వస్తుందన్నారు. అధికారులు స్పందించి వెంటనే కుడి కాలువ ద్వారా నీటిని విడుదల చేయాలని రైతులు కోరారు. ఈ విషయంపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సైతం స్పందించారని.. వెంటనే ఇరిగేషన్ అధికారులకు ఫోన్ ద్వారా తమ పరిస్థితిని తెలియజేశారన్నారు. ఇరిగేషన్ అధికారులు ఫిబ్రవరి మొదటి వారంలో నీటిని విడుదల చేస్తామని చెప్పారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆయిల్‌పామ్ వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షుడు ఎడ్ల సోమిరెడ్డి, అక్కెనపల్లి రైతులు నాగేందర్, సుధాకర్, శ్రీనివాస్, సత్యనారాయణరెడ్డి, నారాయణరెడ్డి, వెంకటేశ్‌గౌడ్, యాదగిరి పాల్గొన్నారు.

## సింగూరును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం

- మంత్రి దామోదర రాజనర్సింహా



సింగూరు ప్రాజెక్టును పరిశీలిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహా

పుల్కల్, జనవరి 27: సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండల పరిధిలోని సింగూరు ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని వైద్యారోగ్య శాఖల మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. సోమవారం సింగూరు ప్రాజెక్టును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ ప్రాజెక్టులో 50 సీట్ల కెపాసిటీతో నడిచే రెండు ఆధునాతన సౌకర్యాలతో కూడిన స్పీడ్ బోట్లను ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. సింగూరు ప్రాజెక్టుకు పెద్దఎత్తున పర్యాటకులను ఆకర్షించడమే లక్ష్యంగా మాస్టర్ ప్లాన్, రోడ్ మ్యాప్‌లను రూపొందించాలన్నారు. ప్రాజెక్టులో ఉన్న ఐల్యాండ్ వాచ్ టవర్‌పైన రెస్టారెంట్, ఫుడ్ కోర్టు, చిల్డ్రన్ ప్లే ఏరియా, ల్యాండ్ స్కేపింగ్, ఆర్ట్ స్కేపింగ్, గార్డెన్లను అభివృద్ధి చేయాలని సూచించారు. ప్రాజెక్టు దిగువ భాగంలోని 29 ఎకరాల్లో రూ.ఐదు కోట్లతో అధునాతన రెస్టారెంట్, 25 కాటేజీలు నిర్మించాలని, ఇందులో చిల్డ్రన్ ప్లే ఏరియా, ఫుడ్ కోర్టు, గార్డెనింగ్, గ్రీనరీ, ల్యాండ్ స్కేటింగ్, పార్కింగ్ ఉండేలా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో సింగూరు డ్యాం పైభాగంలో బీటీ రోడ్డు నిర్మించాలని, పర్యాటకుల కోసం డ్యాం పైకి వెళ్లేందుకు అవసరమైన మెట్ల నిర్మాణం, డ్యాంకబండ్ వెంట పార్క్ అభివృద్ధి, సైక్లింగ్ ట్రాక్, వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ప్రాజెక్టు పరిసరాల్లో సెంట్రల్ లైటింగ్‌కు అవసరమైన ప్రతిపాదనలను ఫిబ్రవరి మొదటి వారంలోగా రూపొందించాలని అధికారులకు సూచించారు.